నేడు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

ఆర్కే పురం/బడంగ్‌పేట్, ఏప్రిల్ 22 : సరూర్‌నగర్‌లోని జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌హాల్‌లో బుధవారం ఉదయం 9 గంటలకు, బడంగ్‌పేట్‌లోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు భూభారతి చట్టంపై అవగాహన సదస్సులను జిల్లా కలెక్టర్ నిర్వహించనున్నట్లు తాసీల్దార్‌లు వేణుగోపాల్, ఇందిరాదేవిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ, ఎంఎల్‌ఏతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. భూభారతిలో ఉన్న సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. భూభారతి పై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సదస్సుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రైతులు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

రైతులు పామాయిల్ పంటలపై దృష్టి సారించాలి

కందుకూరు, ఏప్రిల్ 22 : రైతులు పామాయిల్ పంటలపై దృష్టి సారించాలని ఉద్యానవన శాఖ ఏడీహెచ్ కిషన్ రావు తెలిపారు. మండల కేంద్రంలో ని రైతువేదికలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పామాయిల్ పంటలు వేసుకున్నట్లయితే అధిక లాభాలు పొందవచ్చు అని తెలిపారు. రైతులు ఆర్థికంగా ఎదగాలని, అందుకోసం ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. పామాయిల్ పంటలకు ప్రభుత్వం డ్రిప్, తదితర పరికరాలకు సబ్సిడీ కింద అందజేస్తుందని వివరించారు. ఈ పంటలు వేసుకుంటే కూలీలు, చీడ పురుగుల బెడద ఉండదని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఓ సౌమ్య , ఏఈఓ రాజు, రామ్మోహన్, రైతులు పాల్గొన్నారు.

వరంగల్ రజతోత్సవ సభకు భారీగా తరలి రావాలి

సైదాబాద్, ఏప్రిల్ 22: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు లక్షలాది మంది తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆ పార్టీ యాకుత్‌పుర నియోజకవర్గం ఇన్‌చార్జి సామ సుందర్ రెడ్డి కోరారు. మంగళవారం ఐఎస్ సదన్ డివిజన్, ఎస్ఎన్‌రెడ్డి నగర్ కాలనీలోని తన నివాసంలో నియోజకవర్గ డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన.. పార్టీ రజోత్సవ గోడ పోస్టర్‌ను ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా సామసుందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ ఏర్పడి 25 ఏండ్లు అవుతున్న సందర్భంగా పార్టీ జరుపుకుంటున్న రజతోత్సవ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. పాతబస్తీ నుంచి భారీ సంఖ్యలో పార్టీ నాయకులను, కార్యకర్తలను సభకు తరలించాలని ఆయా డివిజన్ల అధ్యక్షులను కోరారు. పాతబస్తీలో బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభపై విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని, అదే విధంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చే విధంగా పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని, రాచరిక పాలన అని, రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలను మోసం చేస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి చమర గీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఐఎస్ సదన్, సంతోష్ నగర్, కుర్మగూడ, గౌలిపుర డివిజన్ల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, చింతల శ్రీనివాస్, దర్శన నర్సింగ రావు, సీఎం ప్రవీణ్, బొడ్డు సాయిబాబా, సాబేర్, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ బహిరంగ సభ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సామ సుందర్ రెడ్డి , తదితరులు

బిడ్డకు తల్లిపాలే సురక్షితం

పోషణ పక్షం ముగింపు వేడుకల్లో డీడబ్ల్యూ శ్రీలత

బడంగ్‌పేట్, ఏప్రిల్ 22: ఐసీడీఎస్ మహేశ్వరం ప్రాజెక్ట్ సీడీపీఓ శాంతి ఆధ్వర్యంలో మంగళవారం పోషణ పక్షం ముగింపు వేడుకలు నిర్వహించారు. రంగారెడ్డి డీడబ్ల్యూ శ్రీలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. బిడ్డకు మొదటి రోజుల ప్రాముఖ్యత గురించి వివరించారు. రెండు సంవత్సరాలలోపు తీసుకోవలసిన వ్యాధి నిరోధక టీకా లు తప్పనిసరిగా వేయించాలన్నారు. చిరుధాన్యాలు, వాటి ప్రాముఖ్యత వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు ఆరు నెలల వర కు పట్టించాలన్నారు. తల్లిపాలే బిడ్డకు సురక్షితమన్నారు. ఆరు నెలల తరువాత అందించవలసిన అనుబంధ ఆహారం ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య కంప్లీట్ అ యిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించాలన్నారు. ప్రైమరీ పాఠశాలకు వెళ్లేందుకు సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. అనంతరం పోషణ పక్వాడ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో తయారుచేసిన వంటలు, వివిధ రకాల ఆకుకూరలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ రెడ్డి, సఖి సీడీపీఓ ఉమా, మెడికల్ ఆఫీసర్స్ స్వరూప, పద్మావతి, స్నేహ సౌమ్య, స్వప్న, సూపర్‌వైజర్స్ , పోషణ అభియాన్ అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

నేడు కొత్తపేట స్పైసీ హబ్‌లో మేధావుల సెమినార్

ఆర్కే పురం, ఏప్రిల్ 22: భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కొత్తపేటలోని స్పైసీ హబ్‌లో మేధావుల సదస్సు నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా అంబేద్కర్ జయంతి ఉత్సవాల కన్వీనర్ పిట్ట ఉపేందర్ రెడ్డి తెలిపారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి , ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీ నివాస్, తదితరులు హాజరవుతారని తెలిపారు.

ఇంద్రా రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

స్వర్గీయ ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బీఆర్ఎస్ నేతలు

బడంగ్‌పేట్, ఏప్రిల్ 22 : స్వర్గీయ ఇంద్రా రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మీర్‌పేట, బడంగ్‌పేట, మహేశ్వరం, తుక్కుగూడకు చెందిన బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఇంద్రారెడ్డి సమాధి దగ్గర పువ్వులు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బడుగు, బలహీన వర్గాల కోసం ఆయన చేసిన కృషి మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అర్కల కామేశ్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, భూపేశ్‌గౌడ్, సిద్దాల బీరప్ప, మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్ రెడ్డి, శ్రీను నాయక్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బాలరాజ్, మహిళా అధ్యక్షురాలు సునీత బాలరాజ్, సుర్విలత శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

● కందుకూరు : స్వర్గీయ ఇంద్రారెడ్డి ఆశయ సాధన కోసం కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి సామ మహేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకొని ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ అసోసియేషన్ మహిపాల్ రెడ్డి రంగారెడ్డి జిల్లా ఏఎంసీ డైరెక్టర్ గణేశ్, కందాడ మధుసూదన్ రెడ్డి, సామ సురేందర్ రెడ్డి, రవీందర్ గౌడ్, పాండు, కృష్ణగౌడ్, లింగారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

● ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా కందుకూరు మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల ప్రభుత్వ పాఠశాలలో పండ్లు పంపిణీ చేశారు. మండల బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు తాండ్ర ఇందిరమ్మదేవేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు .కార్యక్రమంలో దెబ్బడగూడ మాజీ సర్పంచ్ దేరంగుల జంగయ్య, మాజీ ఎంపీటీసీ సురేశ్, శ్రీనివాసులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణం



నేదునూరులో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు, ఏప్రిల్ 22 : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని నేదునూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ శర్మ తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటేశం బదిలీ కావడంతో ఆయనను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాలు, పూలదండలతో సన్మానించి.. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు .కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయభాస్కర్ రెడ్డి ,కృష్ణ సురేశ్, కర్నాకర్, అబ్దుల్లా , గ్లోరీ, శాంతకుమారి, శ్రీవాణి, కౌసల్య, ఎండీ బషీర్, సర్వర్, హనునోద్దీన్, శ్రీశైలం, విద్యార్థులు పాల్గొన్నారు

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్, ఎస్కేడినగర్ కాలనీలోని లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, సోమిరెడ్డి, బొమ్మ రఘురాం నేత, శంకరయ్యగౌడ్, శ్రీధర్ రావు, కృష్ణారావు, జానకిరామారావు, శ్రీనివాస్‌రావు, రమణ, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

– వనస్థలిపురం, ఏప్రిల్ 22

న్యూట్రిషన్‌పై అవగాహన..

చంపాపేట, ఏప్రిల్ 22 : చంపాపేట డివిజన్ పరిధిలోని యునానీ హాస్పిటల్‌లో, ఆయుష్ మంత్రిత్వ శాఖ, పక్వాడ పోషణ్ అభ్యాన్ సౌజన్యంతో మంగళవారం న్యూట్రిషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయుష్ వైద్యురాలు ఆస్మా, ఆంజుమ్, ఫార్మాసిస్టు హేమారాణిలు పాల్గొని హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో ఉండే బస్తీలు, కాలనీల వాసులకు, స్కూల్ పిల్లలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు ఎనిమియా యాక్షన్, న్యూట్రిషన్‌పై అవగాహన కల్పించారు. దీంతోపాటు లైఫ్‌స్టైల్ వెన్నెస్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యోగా శిక్షకులు భీమయ్య, సచిత యోగా సాధకులతో పలు ఆసనాలు వేయించి ప్రాణాయామం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలు సంక్షేమ సంఘాల నాయకులు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ డివిజన్‌లో డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలి

జనరల్ మేనేజర్ బలరాంకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి అంజన్

ఆర్కే పురం, ఏప్రిల్ 22 . సరూర్‌నగర్ డివిజన్లో నెలకొన్న డ్రైనేజ్ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు యూజీడీ పైప్‌లైన్‌ను పునరుద్ధరించాలని డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ కోరారు. ఈ మేరకు మంగళవారం హెచ్‌ఎండబ్ల్యూఎస్, ఎస్‌బీ జనరల్ మేనేజర్ బలరాం, డీజీఎం సన్యాసిరావులను కలిసి వినతి పత్రం అందజేసి.. డివిజన్‌లోని డ్రైనేజ్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా కాలనీల్లో, బస్తీల్లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడానికి తక్షణమే యూజీడీ పైప్‌లైన్‌ను పునరుద్ధరించాలని కోరినట్లు తెలిపారు.

రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోడీ ప్రభుత్వం

కందుకూరు , ఏప్రిల్ 22 : కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నట్టు మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణ నాయక్ తెలిపారు. జై భీమ్ జై బాపు జై సవిధాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని గూడూరు, కటిక పల్లి, సరస్వతి గూడ, అన్నోజిగూడ గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హింసలేని స్వతంత్ర పోరాటంలో విజయం సాధించిన దేశం నేడు మత కల్లోలాలకు బీజేపీ ఆద్యం పోస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, సొడపు వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సరికొండ పాండు, బుక్క పాండు రంగారెడ్డి, డైరెక్టర్లు సురేందర్ ,ప్రశాంత్ కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, యుగేంధర్ గౌడ్, జగన్, అంజు పాల్గొన్నారు.

బస్సుల్లో మరిచిపోయిన సెల్‌ఫోన్లు ప్రయాణికులకు అందజేత

హయత్ నగర్, ఏప్రిల్ 22 : వేర్వేరు రూట్లలో ఆర్టీసీ బస్సుల్లో మరిచిపోయిన సెల్‌ఫోన్లను బాధిత ప్రయాణికులకు ఆర్టీసీ సిబ్బంది అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం హయత్ నగర్ డిపో – 1కు చెందిన వివిధ బస్సుల్లో మర్చిపోయిన మూడు మొబైల్ ఫోన్‌లను బాధిత ప్రయాణికులకు అందజేశారు. 119/1 సర్వీస్ రూట్‌లో ఓ ప్రయాణికుడు ఎల్‌బీనగర్‌లో బస్సు ఎక్కి ఉప్పల్ మెట్రో వద్ద దిగిపోయాడు. అయితే అతను మర్చిపోయిన సెల్‌ఫోన్‌ను గుర్తించిన డ్రైవర్ కేబీరెడ్డి దాన్ని తీసుకుని.. బాధిత ప్రయాణికుడికి రిటర్న్‌లో అందజేశారు. మరో ఘటనలో జేబీఎస్ నుంచి ఇబ్రహీంపట్నం గురునానక్ కాలేజీకి వెళ్లే రూట్లో ఒక ప్రయాణికుడు కామినేని వద్ద బస్సు ఎక్కి రద్దీ అధికంగా ఉండడంతో రన్నింగ్ బస్సులో నుండి దిగిపోయాడు. అయితే అతని సెల్‌ఫోన్ బస్సులో పడిపోయింది. గమనించి కండక్టర్ సరిత.. ఆ సెల్‌ఫోన్‌ను తీసుకుని ఎల్బీనగర్‌లో పాయింట్ కంట్రోలర్ చేతుల మీదుగా బాధితుడికి అందజేశారు. మరో ఘటనలో 205ఏ రూట్ అనాజ్‌పూర్ నుండి ఉమెన్స్ కాలేజ్‌కు వెళ్తుండగా ప్రయాణికుడు బస్సు ఎక్కి సీట్‌లో సెల్‌ఫోనును మరిచిపోయి రామోజీ ఫిలిం సిటీ వద్ద దిగిపోయాడు. కండక్టర్ ఉదయశ్రీ గమనించి .. హయత్‌నగర్ బస్టాండ్‌లో బాధిత ప్రయాణికుడికి అందజేశారు. ఆయా ఘటనల్లో డ్రైవర్, కండక్టర్ల నిజాయితీకి మెచ్చి డిపో మేనేజర్ విజయ్ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పీర్జాదిగూడలో హైడ్రా డిజిటల్ సర్వే

పీర్జాదిగూడ ఏప్రిల్ 22: పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధి పర్వతాపూర్ సర్వే నంబరు 1,10,11లో మైనార్టీలకు చెందిన భమిని మంగళవారం హైడ్రా అధికారులు వీఆర్వో సైదులు, రెవెన్యూ అధికారులతో కలిసి డిజిటల్ సర్వే నిర్వహించారు. అనంతరం స్థానిక రెవెన్యూ అధికారులను బాధితులను స్థల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విచారణ చేసిన తర్వాత నివేదికను బట్టి చర్యలు చేపడతామని తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు..

మలక్‌పేట న్యూ గవర్నమెంట్ బాలికల జూనియర్ కాలేజ్..

సుస్మిత (985), ఎంపీసీ — శృతి (958), సీఈసీ — శివాత్మిక (451), ఎంపీసీ

జైబున్నిసా (430), బైపీసీ

సైదాబాద్, ఏప్రిల్ 22: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో మలక్‌పేట న్యూ గవర్నమెంట్ బాలికల జూనియర్ కాలేజ్ విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం విడుదలైన పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఉత్తమ ఫలితాలను సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో శివాత్మిక 470కు 451మార్కులు, బైపీసీ విభాగంలో జైబున్నిసా 440కు 430 మార్కులు, సీఈసీలో ఎం. హిందు 500కు 445 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో 203 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 81 మంది ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది 35 శాతం ఉత్తీర్ణులు కాగా ఈసారి 40 శాతం పాస్ కావడంతో 5 శాతం పెరిగింది.

ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో జి. సుస్మిత 1000కు 985 మార్కులు, సీఈసీ విభాగంలో కత్తుల శృతి 1000కు 958 మార్కులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. 194 మంది పరీక్షలు రాయగా 109మంది పాసయ్యారు. గత ఏడాది 59 శాతం సాధించగా ఈసారి 56%తో సరిపెట్టుకోవడంతో మూడు శాతం ఉత్తీర్ణత తగ్గింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అరుణ మాట్లాడుతూ.. గత సంవత్సరం కంటే ఉత్తమ ఫలితాలు సాధించామని, అలాగే కాలేజీ చరిత్రలో తొలిసారిగా ఎంపీసీలో సుస్మిత 985 మార్కులు, శృతి 958 మార్కులు సాధించారని తెలిపారు.

కందుకూరు మండల పరిధిలో..

కందుకూరు, ఏప్రిల్ 22 : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ కాలేజీ విద్యార్థులు రాణించారు. మండల పరిధిలోని కొత్తగూడ గ్రామానికి చెందిన తేజస్విని 1000కు 975 మార్కులు, నేదునూరు ప్రభుత్వ మోడల్ కళాశాలకు చెందిన మస్కాన్ 992 మార్కులు సాధించారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 70 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. సుమిత్ర, అక్షర, సౌమ్య, అనిత, శ్రీజ, చైతన్య,



తేజస్విని (975) — ముస్కాన్ (992) — కావ్య

ఉత్తమ మార్కులు సాధించిన అశ్విని, ఝాన్సీ, అక్షర,సుమిత్ర

లహరి, అనూష, అమృత, విద్యార్థులు బైపీసీ, ఎంపీసీ, సీఈసీలలో రాణించినట్లు ప్రిన్సిపాల్ మంగరాజు తెలిపారు. అదేవిధంగా మోడల్ కళాశాలలో అశ్విని, అక్షిత, కావ్య, ఝాన్సీ, రమ్యశ్రీలు రాణించినట్లు ప్రిన్సిపాల్ విష్ణు ప్రియ తెలిపారు.

సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల..

ఉత్తమ మార్కులు సాధించిన మదిహ తహసిన్, దార్తి

ఆర్కే పురం, ఏప్రిల్ 22: : ఇంటర్మీడియట్ ఫలితాల్లో సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అత్యున్నత ఫలితాలు సాధించారు. 61. 11 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థిని మదిహ తహసిన్ 1000కు 978 మార్కులు సాధించి మొదటి స్థానంలో, ఎంపీసీలో పి. దార్తి 1000కు 950లతో మొదటి స్థానంలో నిలిచారు. అలాగే.. సీఈసీలో జె. స్వప్న 1000కు 856 మార్కులు, హెచ్‌ఈసీలో ఈ. జ్యోతి 1000కు 686 మార్కులు, ఎంఎల్‌టీలో వి. శ్వేత 1000కు 899 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ విద్యార్థులను అభినందించారు.

రోడ్డు తవ్వారు.. వదిలేశారు

ఇబ్బంది పడుతున్న బస్తీవాసులు.. వాహనదారులు

సైదాబాద్, ఏప్రిల్ 22: రోడ్డును తవ్వి వదిలేశారు. దీంతో గత మూడు నెలలుగా బస్తీవాసులు, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సైదాబాద్ డివిజన్ పరిధి, ఆస్మాన్‌ఘడ్ గాంధీనగర్ వెళ్లే మార్గంలో.. ఆస్మాన్‌ఘడ్ గాంధీ నగర్, లంబాడీబస్తీ, సైదాబాద్ కాలనీలకు కనెక్టివిటీ రోడ్డును, కొత్తగా సీసీ రోడ్డు వేయడానికి మూడు నెలల క్రితం తవ్వి వదిలివేశారు. అప్పటినుంచి ఆ రహదారిపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతూ.. రోడ్డు ప్రమాదాల బారినపడి గాయాలపాలవుతున్నారు. ప్రమాదాలు జరిగే విషయాన్ని స్థానికులు అనేకసార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు విన్నవించుకున్నా స్పందనలేదని ఆరోపించారు. మూడు నెలలుగా తాము పడుతున్న బాధలను సదర్ కాంట్రాక్టర్, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వెంటనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని, లేకుంటే జోన ల్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

ప్రమాదకరంగా మారిన ఆస్మాన్‌ఘడ్ వెళ్లే మార్గంలో తవ్విన రోడ్డు

పోలీసుల సేవాతత్వం..

హయత్ నగర్, ఏప్రిల్ 22 : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడగా.. అటుగా వెళ్తున్న ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ గమనించి.. తమ వాహనంలో బాధితురాలిని దవాఖానకు తీసుకెళ్లి తమ సేవా తత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హయత్‌నగర్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. అదే సమయంలో అటుగా వెళుతున్న హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, డ్రైవర్ రామకృష్ణలు వెంటనే స్పందించి తమ పెట్రోలింగ్ వాహనంలో బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆలస్యం చేయకుండా ఆమెను సమీప ఆసుపత్రికి తీసుకెళ్లడంతో స్థానికులు అభినందించారు. ఈ ఘటనలో పోలీసుల వేగవంతమైన స్పందన ఒక జీవితాన్ని కాపాడింది.

వ్యక్తి అదృశ్యం

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 22 : అప్పుల బాధలతో ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సందీప్‌కుమార్ కథనం ప్రకారం.. వినాయకనగర్‌లో నివాసం ఉంటున్న కొంగరి కృష్ణ (30) పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కృష్ణ ఇల్లు కట్టుకోవడానికి అప్పు చేశాడు. అప్పులు తీర్చలేక బాధతో మనస్తాపం చెంది ఈనెల 21న ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. ఈ రోజువరకు ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తామని తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE ADDL. FAMILY COURT JUDGE : AT HYDERABAD
G.W.O.P.No. 31 OF 2025
Between:
Mrs. Farah Mohammed Abdul Qadeer, D/o. Mohammed Abdul Qadeer, through G.P.A., ...Petitioner
AND
Yunus Saleem ...Respondent
NOTICE
To
Yunus Saleem, S/o. Mohammed Abdul Salam, Aged about 46 years, Occ: Service, R/o. H.No. Near Green Water Tank, N.G.O's Colony, Vanasthalipuram, R.R. District.
Take notice that the above named petitioner has filed the above case to declare her as guardian for her Minor Son **Rushan Yunus Saleem.** And the above case is posted on: **05-05-2025 at 10.30 A.M.** for your appearance in person or through counsel. Failing which the case will be decided as per law.
Sd/- SYED KAREEMUDDIN SHAKEEL,
Advocate
Office No. 9-125/52 & 53, Green City, Balapur, R.R. District-500 005,
Mobile No. 9849737712.
// BY ORDER OF THE COURT //